క్లుప్తంగా

సెమీ ఆటోమెటిక్ ఎనలైజర్ ప్రారంభం

మణుగూరుటౌన్: మండలంలోని వాగుమల్లారం ప్రాంతంలోని మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సెమీ ఆటోమేటిక్ ఎనలైజర్ బయో కెమికల్ మిషన్, నూతన ఫ్రిడ్జ్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. తొలుత మేడే సందర్భంగా ఆస్పత్రిలోని పారిశుద్ధ్య కార్మికులకు బహుమతులు అందించి వారి సేవలను కొనియాడారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, ఆర్ఎంఓ గౌరి ప్రసాద్, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ సంజీవరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా మందిర నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో పాలక వర్గ నూతన అధ్యక్షుడిగా కొమ్మనపల్లి ఆదినారాయణతో పాటు సభ్యులు ప్రమాణ స్వీకరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు, ఫారెస్ట్ డెవలప్మెంట్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

సమ్మక్క-సారలమ్మ జాతర

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని కొత్త అల్లిగూడెం గ్రామంలో సమక్క-సారలమ్మ జాతర ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. కొలువుదీరిన గ్రామదేవతలను గ్రామస్తులతోపాటు, చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అలాగే గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో జాతర ఉత్సవాల సందడి నెలకొంది.

కుల గణన కాంగ్రెస్ విజయం



రాహుల్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: దేశంలో కుల, జన గణను కాంగ్రెస్ కృషితోనే కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం జరిగిందని, ఇది తెలంగాణ ప్రభుత్వ విజయమని జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుల గణన నిర్వహించాలని క్యాబినెట్‌లో తీర్మానం చేసి కేంద్రానికి పంపడంతో దేశం మొత్తం కుల, జన గణన చేయాలనే ఆలోచన వచ్చిందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి ఇది ఒక పెద్ద విజయంగా ఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో రవి కుమార్, వెంకటేశ్వర్లు, సరిత, వరుణ్, సాంబశివరావు, రామ్మోహన్ రెడ్డి, శేషు, కాపుల శ్రీను, కార్తీక, జయ, మాధవరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



పినపాక: దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పినపాక: మండల పరిధిలోని ఈ బయ్యారం గ్రామానికి చెందిన సూరెడ్డి సుజాత, తిరుపతిరెడ్డి (బుల్లిరెడ్డి)ల కుమార్తె సూరెడ్డి సంజనా రెడ్డి ఉన్నత ఉద్యోగం సాధించగా.. తన మొదటి జీతంలో సగం రూ.1,55,652లను సాయిబాబా గుడికి విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొండ తిరుపతిరెడ్డి, మాలపాటి రామిరెడ్డి, శిరసాని రాంబాబు, ఆలయ పూజారి అంబడిపూడి ప్రసాద్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం..

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లో ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో కుంచాల శ్రీనివాస్-లక్ష్మి రేణుక దంపతులు, నవీన్‌కుమార్, చైత్యలు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం ఆలయకమిటీ సభ్యులు వారిని శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

వాడవాడలా మేడే వేడుకలు

■ రెపరెపలాడిన అరుణ పతాకాలు ■ కార్మికుల ఐక్యతకు పిలుపునిచ్చిన నాయకులు

రాజకీయ పార్టీలు, కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో గురువారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత ఆయా కార్యాలయాలు, సెంటర్ల వద్ద నాయకులు ఎర్ర జెండాలను ఎగురవేసి అమరవీరుల త్యాగాలను కొనియాడారు. ప్రజాప్రతినిధులు, నాయకులు కార్మికులను సన్మానించి, మేడే శుభాకాంక్షలు తెలిపారు. వక్తలు మాట్లాడుతూ.. కార్మికుల శ్రమను కొనియాడారు. చికాగో అమరవీరుల స్ఫూర్తితో కార్మిక హక్కులను సాధించుకోవాలని, కేంద్ర లేబర్‌కోడ్‌లపై, సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



గుండాలలో జెండా ఎగురవేస్తున్న ఎన్డీ నాయకులు



చర్ల: సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



మణుగూరురూరల్: మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి



మణుగూరురూరల్: జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



ములకలపల్లి: సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తున్న కార్మికులు



మణుగూరురూరల్: మేడే జెండా ఎగురవేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య



చంద్రుగొండ: సీపీఎం ఆధ్వర్యంలో మేడే వేడుకలు..



దుమ్ముగూడెం: ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..



దమ్మపేట: జెండావిష్కరణలో పాల్గొన్న సీపీఐ నాయకులు, కార్మికులు



భద్రాచలంటౌన్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



అశ్వాపురం: మొండికుంటలో సీపీఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలు



అశ్వారావుపేటరూరల్: ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో..

సీఐలకు పురస్కారం



పినపాక: ఎస్పీ రోహిత్ రాజ్ నుంచి రివార్డ్ అందుకుంటున్న సీఐ వెంకటేశ్వరరావు

పినపాక: ఏజెన్సీ మండలంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావుకు ఉత్తమ సేవా పురస్కారం అందింది. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ చేతుల మీదగా ఎస్పీ కార్యాలయంలో ఉత్తమ సేవ పురస్కారంతోపాటు క్యాష్ రివార్డ్ అందుకున్నారు. ఈ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.



గుండాల: సీఐ రవీందర్..

గుండాల: ఏజెన్సీ ప్రాంతంలో అత్యుత్తమ సేవలందిస్తున్న గుండాల సీఐ రవీందర్‌కు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా మంగళవారం క్యాష్ రివార్డు అందుకున్నారు. మండలంలోని ప్రజలకు అవగాహన కల్పించడంలో, పోలీస్ శాఖ ద్వారా సేవలందించడంలో సీఐ ముందుండడంతో జిల్లా ఎస్పీ కార్యాలయంలో సీఐని సన్మానించారు. ఆపై ఆ రివార్డును అందించారు.

విద్యార్థులకు పలువురి అభినందన

ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో..

భద్రాచలంటౌన్: ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చదివి టెన్త్ ఫలితాల్లో మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన జ్ఞాన వికాసిని (551), లక్ష్మి (531)లను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గురువారం అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ టి.రమ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: పది ఫలితాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శాలువాతో సత్కరించారు. మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్మికులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: పదిలో అత్యుత్తమ మార్కులతో మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన బండ్ల సత్య అనీషిని(585), అంచుమల్ల సిరి(583), మేడ భానుప్రసాద్(580) లను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాలువాతో సన్మానించి అభినందించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, శ్రీవిజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ సాంబశివరెడ్డి, శ్రీసత్యభాస్కర మాంటిస్సోరీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో 580 మార్కులు సాధించిన శ్రీవిజ్ఞాన్ పాఠశాల విద్యార్థి మేడ భానుప్రసాద్‌ను గురువారం మణుగూరు మండల మున్నూరుకాపు సంక్షేమ సంఘం నాయకులు వారి కార్యాలయంలో శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం నియోజకవర్గ కోఆర్డినేటర్ వలసాల వెంకటరామారావు, మండల కార్యదర్శి గాండ్ల సురేష్, పోట్ల ముతయ్య, బత్తుల వీరయ్య, లక్ష్మిశెట్టి ప్రసాద్, వనం సత్యనారాయణ, సుధా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట: విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



భద్రాచలంటౌన్: జెడ్పీ పాఠశాల విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

క్షయ నివారణ కేంద్రంలో తనిఖీ



భద్రాచలంటౌన్: సిబ్బందితో మాట్లాడుతున్న పుల్లారెడ్డి

భద్రాచలంటౌన్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా క్షయ కంట్రోల్ అధికారి డాక్టర్ పుల్లారెడ్డి.. గురువారం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని జిల్లా అదనపు క్షయ నివారణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్‌టీఈపీ రిపోర్ట్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో జరిపిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. సిబ్బంది సమన్వయంతో పని చేసి జాతీయస్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామానికి చెందిన ఆచంట సత్యనారాయణ బుధవారం బైక్‌పై అశ్వాపురంలో శుభకార్యానికి వచ్చి స్నేహితుడితో కలిసి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని మిట్టగూడెంలో మణుగూరు నుంచి అశ్వాపురం వైపు వస్తున్న ఆటో.. వారి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో సత్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

'ఉపాధి' ఉద్యోగుల నిరసన

దమ్మపేట: తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధి హామీ ఉద్యోగులు, రెండో రోజు కూడా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయానికి హాజరైన ఉద్యోగులు.. విధులు నిర్వర్తించకుండా పెన్ డౌన్ చేశారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ అధ్యక్షులు వేముల సుధాకర్ రావు, పట్నాయక్, సత్యనారాయణ, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రహదారి కష్టాలు తీరేదెన్నడో!?

- వ్యవసాయ వాహనాలు రాలేని పరిస్థితి
- ఏళ్లు గడుస్తున్నా అదే దుస్థితి..

పినపాక: సంవత్సరాలు గడుస్తున్న ఎల్చిరెడ్డిపల్లి రహదారి కష్టాలు తీరడం లేదు. గత వరదలకు రహదారి కొట్టుకుపోవడంతో తాత్కాలిక రహదారుల వెంట వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. నూతన రహదారి నిర్మిస్తామని చెబుతున్న అది ప్రతిపాదనలకే పరిమితం అయింది.

భారీ వాహనాలు రాలేవు..

గత కొన్ని సంవత్సరాలుగా వర్షాలకు బయ్యారం పెద్దవాగు పొంగడంతో ఎల్చిరెడ్డిపల్లి ప్రధాన రహదారి కోతకు గురైంది. పక్కన ఉన్న పంట పొలాలను కలుపుకుంటూ తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మించినప్పటికీ మళ్లీ కోతకు గురికావడంతో వర్షాలకు భారీ వాహనాలు రాలేని పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో సాధారణ వాహనాలైన ఆటో, బైక్ వ్యవసాయ ట్రాక్టర్ వంటివి కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. రైతుల కోసం లారీలు, హార్వెస్టర్లు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

స్పందన లేని అధికారులు..

నూతన రహదారి నిర్మించాలని అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గతంలో మూడు కోట్లతో నూతన రహదారి నిర్మిస్తున్నామని, ప్రతిపాదనలు సిద్ధం చేశామని అధికారులు చెప్పినప్పటికీ అది వాస్తవ రూపం దాల్చలేదు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



మట్టి పోసి నిర్మించిన ఇరుకు రహదారి

రాత్రి వేళల్లో అవస్థలు..



పనులు ముగించుకుని రాత్రి వేళల్లో ఇంటికి వెళ్లాలంటే రోడ్డు ఎక్కడ వరకు ఉన్నదో తెలియని పరిస్థితి. ద్విచక్ర వాహనంపై వెళ్తున్నప్పుడు రోడ్డు చివర అంచు తెలియక అందులో పడే అవకాశం ఉంది. కొత్తవారు గ్రామాల్లోకి రావాలంటే రాత్రి సమయంలో అర్థం కాని పరిస్థితి. అధికారులు స్పందించి నూతన రహదారి నిర్మించాలి.

– బాబురావు, ఎల్చిరెడ్డిపల్లి

డిగ్రీ విద్యార్థులకు 'ఇంపాక్ట్' ప్రోగ్రాం

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదివే విద్యార్థుల కోసం భద్రాచలం ఐటీడీఏ ద్వారా నిర్వహిస్తున్న ఇంపాక్ట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.స్పందన అన్నారు. గురువారం మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని డిగ్రీ కళాశాలలో ఇంపాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిగ్రీ ప్రథమ సంవత్సరం నుంచే విద్యార్థులకు కళాశాలలో బ్యాంకింగ్, గ్రూప్స్‌కు సంబంధించిన కోచింగ్‌లను ఇచ్చేందుకు కొత్తగూడెం రీజియన్ పరిధిలో ఏర్పాట్లు చేస్తున్నారని వివరించారు. ఖమ్మంలో జరిగిన ఉద్యోగ మేళ కార్యక్రమంలో కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆమె చేతుల మీదుగా ఆవిష్కరించగా.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాలకు చెందిన విద్యార్థినులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



డిగ్రీ ప్రవేశాల ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ స్పందన, తదితరులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ జయలక్ష్మి

ములకలపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ జయలక్ష్మి సూచించారు. కొత్తగంగారం జీపీ పరిధిలోని గొత్తికోయ గ్రామమైన వాగొడ్డుగుంపులో గురువారం ఆమె పర్యటించారు. బాలింతలు, గర్భిణులకు వైద్యం అందుతున్న విధానాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రైడే డ్రైడే పాటించాలని అన్నారు. గర్భిణులు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని వైద్యసిబ్బందికి సూచించారు. స్థానిక వైద్యాధికారి సాయికల్యాణ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సోమ్లా నాయక్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకృష్ణ, ధనలక్ష్మి, ఏఎన్ఎం గీత తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

చంద్రుగొండ: దేశవ్యాప్తంగా కులగణన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని నాయకులు అన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లమోతు రఘుపతిరావు, భోగి కృష్ణ, భూక్య రాంపండు, జటంగి కృష్ణ, రసపుత్ర వందనం, చేవూరి విజయభాస్కర్, ఇస్లావత్ రవి పాల్గొన్నారు.


భద్రాచలంటౌన్: పట్టణంలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా కుల, జన గణను నిర్వహించేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంతో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. జన, కుల గణనతో దేశంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కుంజా ధర్మ, సతీష్, నాగబాబు, శ్రీనివాస్, రామ్మోహన్‌రావు, ఉపేంద్ర, వెంకన్న, చంద్రశేఖర్, నారాయణ పాల్గొన్నారు.

మణుగూరురూరల్: దేశవ్యాప్తంగా జన, కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపన సీతారామరాజు మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోగే చందర్ రావు, మీసాల దుర్గారావు, పున్న బిక్షపతి, ఈసాల వెంకటేశ్వర్లు, పట్టా బిక్షపతి, కేవీ మధుసూదన్, కుంజా రామకృష్ణ, టి.రవి, పి.కిషోర్‌బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మణుగూరురూరల్: పీఎం మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు



మామిళ్లవాయిలో అసంపూర్తిగా నిలిచిపోయి డబుల్ బెడ్‌రూం ఇళ్లు

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన మామిళ్లవాయి గ్రామంలో గత ప్రభుత్వంలో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పునాదులు, పిల్లర్లకే పరిమితమై అసంపూర్తిగా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆయా పరిసరాలు అడవిని తలపిస్తున్నాయి. గ్రామంలో 2017 డిసెంబర్ 22న ఒక్కో ఇల్లు రూ.5.04 లక్షలతో 30 ఇళ్లకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఆలస్యంగా పనులు ప్రారంభమై రెండేళ్లపాటు పనులు నత్తనడకన సాగాయి. నిర్మాణ వ్యయం పెరగడంతో ప్రభుత్వం చెల్లించే డబ్బు గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులు నిలిపివేశాడు. 10 ఇళ్లు స్లాబ్ వేయగా, 10 ఇళ్లు గోడలు, 10 ఇళ్లు పునాదులు, పిల్లర్ల స్థాయిలో ఉన్నాయి. ఇప్పటికి ఏడేళ్లు గడిచినా ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పిచ్చిమొక్కలు మొలచి దట్టమైన అటవీ ప్రాంతాన్ని తలపిస్తోంది. ప్రభుత్వం స్పందించి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని, వాటిని నిరుపేదలకు అందించాలని స్థానికులు కోరుతున్నారు.